సాక్షి
నంద్యాల
సోమవారం : 20 : నవంబర్ : 2023



అమ్మవారికి పల్లకీ సేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల ఉత్సవమూర్తులకు ఆదివారం పల్లకీ సేవ నిర్వహించారు. పల్లకీలో ఉత్సవమూర్తుల నుంచి మేళతాళాలతో ఆలయ ప్రదక్షిణ చేశారు.



కేసీకి 1,616 క్యూసెక్కుల నీరు

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు 1,616 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. ఇన్‌ఫ్లో నిలిచిపోగా..డ్యాంలో 1.20 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి పెద్దారవీడుకు చెందిన కె. నాగిరెడ్డి రూ.1,01,116 ఆదివారం విరాళంగా ఇచ్చారు.

న్యూస్‌రీల్

నేడు జగనన్నకు చెబుదాం - స్పందన

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల: స్థానిక కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో వినూత్న తరహాలో 'జగనన్నకు చెబుదాం–స్పందన' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు వినతులు స్వీకరించే ఈ కార్యక్రమానికి జిల్లాధికారులందరూ హాజరు కావాలన్నారు. అలాగే జిల్లా కేంద్రంతో పాటు మండల, నియోజకవర్గ, డివిజన్ స్థాయిలో కూడా యథాతథంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

రేపు ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం

కర్నూలు(అగ్రికల్చర్): ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని ఈ నెల 21న నిర్వహిస్తున్నట్లు జిల్లా మత్స్యశాఖ ఉప సంచాలకులు శ్యామల ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ సృజన ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా స్థాయి కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మత్స్యకారులకు ఇన్‌పుట్స్ కూడా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

'ఓపెన్' ప్రవేశ రుసుం గడువు పొడిగింపు

కర్నూలు సిటీ: ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్మీడియెట్ ప్రవేశ రుసుం చెల్లించే గడువును మరోసారి పొడిగించినట్లు డీఈఓ రంగారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల 15 వరకు ఉన్న గడువును 31 వరకు మొదటగా పొడిగించామని, మరోసారి ఈ నెల 28వ తేదీ వరకు గడువు పెంచినట్లు పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి ఉండి 14 సంవత్సరాల వయస్సు కలిగిన వారు ఏవరైన 10వ తరగతికి, 15 సంవత్సరాల వయస్సు నిండి టెన్త్ పాసైన వారు ఇంటర్మీడియెట్ చదివేందుకు అర్హులని తెలిపారు.

రగ్బీ చాంపియన్ కర్నూలు



ట్రోఫీని అందుకుంటున్న కర్నూలు జట్టు

కర్నూలు (టౌన్): రగ్బీ చాంపియన్లుగా కర్నూలు (బాలుర), అనంతపురం (బాలికలు) జట్లు నిలిచాయి. నగర శివారులోని ఆదర్శ విద్యా సంస్థల క్రీడా ప్రాంగణంలో రెండు రోజులుగా జరుగుతున్న 67వ రాష్ట్ర స్థాయి స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అండర్–14 రగ్బీ క్రీడా పోటీలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. బాలుర విభాగంలో శ్రీకాకుళం జట్టు రెండో స్థానం, నెల్లూరు జట్టు మూడవ స్థానం, బాలికల విభాగంలో కడప రెండో స్థానం, ప్రకాశం జట్టు మూడో స్థానంలో నిలిచాయి. విజేతలకు నగరపాలక సంస్థ 20వ వార్డు కార్పొరేటర్ నాగలక్ష్మి రెడ్డి, ఎల్లమ్మ దేవస్థానం చైర్మన్ క్రిష్ణుడు, రాష్ట్ర రగ్బీ పోటీల పరిశీలకులు గణేష్, జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి లక్ష్మయ్య, రాష్ట్ర రగ్బీ సంఘం కార్యదర్శి రామాంజనేయులు ట్రోఫీలు అందజేశారు.

విద్యుత్ సమస్యలపై వెంటనే స్పందించాలి

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ అంతరాయ సమస్యలపై వెంటనే స్పందించాలని ఆ శాఖ అధికారులను దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం. ఉమాపతి ఆదేశించారు. ఆదివారం ఆయన స్థానిక విద్యుత్ భవన్ నుంచి కిందిస్థాయి అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ కారణాలతో బ్రేక్ డౌన్, ఫీడర్ డౌన్, ట్రిప్పింగ్స్, ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫ్యూజ్ కాలిపోవడం వంటి సమస్యలు తలెత్తుతుంటాయన్నారు. అంతరాయ సమస్యల కారణంగా ప్రజలు అసౌకర్యానికి గురవుతారని, ఫిర్యాదులు వచ్చిన వెంటనే స్పందించి పరిష్కారం చూపాలని ఆదేశించారు. నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పోషకాలు జోడించి.. ఆరోగ్యాన్ని వడ్డించి

- ఫోర్టిఫైడ్ బియ్యంలో పుష్కలంగా సూక్ష్మ పోషకాలు
- మెండుగా ఫోలిక్‌యాసిడ్, ఐరన్ లభ్యం
- ప్రతి నెలా రేషన్ కార్డుదారులకు ప్రభుత్వం పంపిణీ
- అంగన్‌వాడీ కేంద్రాలు, గోరుముద్దకూ ఇదే బియ్యం



రేషన్ వాహనాల ద్వారా ఫోర్టిఫైడ్ బియ్యం పంపిణీ చేస్తున్న దృశ్యం



గోడౌన్ నుంచి బియ్యాన్ని లారీలో రేషన్ షాపులకు తరలిస్తున్న దృశ్యం

రేషన్ కార్డులు .. 5,49,169 / రేషన్ షాపులు.. 1,204
ఎండీయూ వాహనాలు.. 351
ప్రతి నెలా బియ్యం పంపిణీ.. 7,228 టన్నులు

నంద్యాల(అర్బన్): ప్రజా ఆరోగ్య సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసింది. ఓ వైపు వైద్య సేవలను బలోపేతం చేస్తూ మరో వైపు పౌష్టికాహారాన్ని అందిస్తోంది. పౌష్టికాహార లోపంతో అనారోగ్యం బారిన పడుతున్న ప్రజలకు పుష్కలంగా సూక్ష్మ పోషకాలు ఉండే ఫోర్టిఫైడ్ బియ్యాన్ని అందిస్తోంది. బియ్యానికి అదనంగా విటమిన్లు, పోషకాలను జోడించడాన్ని రైస్ ఫోర్టిఫికేషన్ అంటారు. దారిద్య్ర రేఖకు దిగువన ఉన్న కార్డు దారులకు పోషక విలువలు కలిగిన ఫోర్టిఫైడ్ బియ్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పంపిణీ చేస్తోంది. ఐరన్, ఫోలిక్ యాసిడ్ విటమిన్–బీ12 వంటి కీలక సూక్ష్మ పోషకాలను అదనంగా బియ్యంలో చేర్చి పౌష్టికాహార లోపాన్ని అరికట్టే ప్రయత్నం ప్రభుత్వం చేస్తోంది. నంద్యాల జిల్లాలో 5,49,169 బియ్యం కార్డులు ఉన్నాయి. కార్డుదారులకు ప్రతి నెలా 7,228 టన్నుల ఫోర్టిఫైడ్ బియ్యాన్ని ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. జిల్లాలో 1,204 రేషన్ షాపులు ఉండగా వాటి నుంచి 351 ఎండీయూ వాహనాల ద్వారా కార్డు దారులకు ఫోర్టిఫైడ్ బియ్యం సరఫరా అవుతున్నాయి. ఫోర్టిఫైడ్ బియ్యాన్ని ఆహారంగా తీసుకోవడం ద్వారా శరీరానికి సూక్ష్మపోషకాలు అందుతాయి. ప్రధానంగా పౌష్టికాహార లోపం ఉన్న మహిళలు, చిన్నారులకు ఫోర్టిఫైడ్ బియ్యం ఎంతో ఉపయోగంగా ఉంటాయి. ఫోలిక్ యాసిడ్, ఐరన్, విటమిన్ బీ12తో చేసిన పిండితో ఫోర్టిఫైడ్ బియ్యం కెర్నెల్స్ తయారు చేస్తారు. వీటిని ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అందిస్తున్న బియ్యంలో కలుపుతారు. ఐసీడీఎస్, ప్రజా పంపిణీ వ్యవస్థ, మధ్యాహ్న భోజన పథకం వంటి ప్రభుత్వ పథకాల్లో ఫోర్టిఫైడ్ బియ్యాన్ని అందిస్తోంది. జిల్లాలో 1,363 అంగన్‌వాడీ కేంద్రంలోని 14,470 మంది గర్భిణులు, 12,535 మంది బాలింతలు, 1.20 లక్షల మంది చిన్నారులకు ఫోర్టిఫైడ్ బియ్యంతో వండిన ఆహారాన్ని అందిస్తున్నారు. అలాగే జిల్లాలోని 1,409 పాఠశాలల్లో సుమారుగా 1,54,561 విద్యార్థులకు రోజు పాఠశాలల్లో అందించే గోరుముద్ద పథకానికి ఫోర్టిఫైడ్ బియ్యాన్ని వినియోగిస్తున్నారు.

ఆరోగ్యానికి ఎంతో మేలు..

ఫోర్టిఫైడ్ బియ్యం ఆరోగ్యానికి ఎంతో మేలు చేకూరుస్తుంది. ముఖ్యంగా ఇందులోని ఫోలిక్ యాసిడ్ గర్భిణులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. పిల్లల్లో మెదడు, వెన్నెముక పెరుగుదలకు తోడ్పడుతుంది. ఇక విటమిన్ బీ–12 మెదడు, నాడీ వ్యవస్థ అభివృద్ధికి, ఎర్రరక్తకణాల ఉత్పత్తిలో కీలకంగా పని చేస్తుంది. రక్తంలో హిమోగ్లోబిన్ స్థాయిని సరైన మోతాదులో ఉంచుతూ రక్తహీనతను అరికట్టడంలో ఐరన్ ప్రధాన పాత్ర పోషిస్తుంది. 400 మైక్రో గ్రామ్స్ అవసరం మనం రోజూ తీసుకునే ఆహారంలో 400 మైక్రోఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) సూచించిన ప్రమాణాలకు అనుగుణంగా మనం తీసుకునే వంద గ్రాముల అన్నంలో ఫోలిక్ యాసిడ్ 17 మైక్రోగ్రామ్స్ నుంచి 125 మైక్రోగ్రామ్స్ మధ్య ఉండాలి. అదే విధంగా ఐరన్ 28 నుంచి 42 మిల్లీ గ్రాములు ఉండాలి. ఇక ప్రభుత్వం అందిస్తున్న ఫోర్టిఫైడ్ బియ్యం 100 గ్రాముల్లో 98 మైక్రోగ్రామ్స్ ఫోలిక్ యాసిడ్, ఐరన్ 40 మిల్లీ గ్రాములు ఉంటుంది. ఇక విటమిన్ బీ12 సమృద్ధిగా లభిస్తుంది.

ప్రయోజనాలు వివరిస్తున్నాం



ఫోర్టిఫైడ్ బియ్యంలో ఉండే సూక్ష్మపోషకాలు, ఆ బియ్యంతో చేసిన ఆహార పదార్థాలు తీసుకోవడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనం గురించి అంగన్‌వాడీ కార్యకర్తలు తమ పరిధిలోని మహిళలకు వివరంగా తెలియజేస్తున్నారు. ఫోలిక్ యాసిడ్ ఐరన్, విటమిన్ బీ–12 కలిగిన ఈ బియ్యంతో చేసిన పదార్థాలు బలవర్ధకమైన ఆహారం. దీన్ని తీసుకోవడం వల్ల గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత సమస్య నివారిస్తుంది.

– నిర్మల, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ, నంద్యాల

సూక్ష్మ పోషకాలు పుష్కలం



ఫోర్టిఫైడ్ బియ్యంలో సూక్ష్మపోషకాలు పుష్కలంగా ఉన్నాయి. ఫోర్టిఫైడ్ బియ్యం తీసుకోవడం ద్వారా ఆరోగ్యానికి ఎంత ఉపయోగకరమో ప్రజలకు విస్తృత అవగాహన కల్పిస్తున్నాం. ఫోర్టిఫైడ్ బియ్యం తీసుకోవడం వల్ల ఎలాంటి ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయనే విషయాన్ని బియ్యం పంపిణీ చేసే సమయంలో కార్డుదారులకు తెలియజేయాలని వలంటీర్లకు, ఎండీయూ వాహన నిర్వాహకులకు చెబుతున్నాం.

– రాజానాయక్, సివిల్ సప్లయ్ జిల్లా అధికారి, నంద్యాల

సహకార బ్యాంకులో రెండు కొత్త డిపాజిట్ పథకాలు

- డీసీసీబీ జోనల్ మేనేజర్ శివలీల

నంద్యాల(సెంట్రల్): జిల్లా సహకార కేంద్ర బ్యాంకు రెండు కొత్త డిపాజిట్ పథకాలను ఖాతాదారులకు అందుబాటులోకి తెచ్చినట్లు డీసీసీబీ జోనల్ మేనేజర్ శివలీల తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. ఇంటింటికీ సహకార సేవల విస్తరణే లక్ష్యంగా 'సహకార సమైక్య డిపాజిట్', 'సహకార సమృద్ధి డిపాజిట్' పథకాలను ప్రారంభించామన్నారు. సహకార సమైక్య డిపాజిట్‌లో భాగంగా జీరో ఖాతా తెరవటంతో పాటు, ఒక ఏడాదికి ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన వర్తింపజేస్తామన్నారు. ఉచిత ఏటీఎం మంజూరుతో పాటు, ఫిక్స్‌డ్ డిపాజిట్లపై అమలులో ఉన్న వడ్డీ రేట్లు కల్పిస్తామని వివరించారు. ఈ పథకం 2024 జనవరి 30 వరకు మాత్రమే కొనసాగుతుందన్నారు. అదే విధంగా సహకార సమృద్ధి డిపాజిట్‌లో భాగంగా 456 రోజుల కాలపరిమితితో డిపాజిట్‌లు స్వీకరిస్తున్నామన్నారు. ఇందుకు గాను సీనియర్ సిటిజన్స్‌కు 8.20%(ఎఫెక్టివ్ రేటు–8.56%), 60 ఏళ్లలోపు వారికి 7.70%(ఎఫెక్టివ్ రేటు–8%) గా వడ్డీరేటు కల్పిస్తున్నామని తెలిపారు. ఈ పథకంలో లక్ష డిపాజిట్ చేస్తే ఒక ఏడాదికి పీఎంజేజేబీవై, ప్రీమియం బ్యాంకు భరిస్తుందని పేర్కొన్నారు. ఖాతాదారులకు పూర్తి భద్రతతో రూ.5 లక్షల వరకు డిపాజిట్ ఇన్సురెన్స్ గ్యారెంటీ సౌకర్యం ఉందన్నారు. ఈ పథకంలో చేరేందుకు వచ్చే నెల 12 వరకు అవకాశం ఉంటుందన్నారు.

నేడు జిల్లా స్థాయి షూటింగ్ బాల్ ఎంపిక పోటీలు

నంద్యాల(న్యూటౌన్): బనగానపల్లె మండలం పలుకూరు జిల్లా పరిషత్ క్రీడా మైదానంలో సోమవారం షూటింగ్ బాల్ జిల్లా స్థాయి అండర్ 17, 19 బాల బాలికల విభాగంలో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి నరేష్ కుమార్ ఆదివారం తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు వచ్చే నెల 9 నుంచి 1 వరకు బాపట్ల జిల్లాలో జరిగే 42వ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

వచ్చే నెలలో లా వర్సిటీకి సీఎం జగన్ భూమిపూజ

- వర్సిటీకి కేటాయించిన భూములను పరిశీలించిన ఆర్థికశాఖ మంత్రి బుగ్గన



జగన్నాథగట్టులో లా యూనివర్సిటీకి కేటాయించిన స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

కర్నూలు(సెంట్రల్): రాయలసీమకు త్వరలోనే న్యాయ రాజధాని హంగులు తెస్తామని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చెప్పారు. కర్నూలులోని జగన్నాథగట్టుపై 150 ఎకరాల్లో నిర్మించనున్న జాతీయ న్యాయ విశ్వ విద్యాలయానికి డిసెంబర్‌లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా భూమిపూజ చేయించనున్నట్లు చెప్పారు. ఇందుకోసం అవసరమైన ఏర్పాట్లను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఆదివారం ఆయన న్యాయ విశ్వ విద్యాలయానికి కేటాయించిన భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వర్సిటీ అందుబాటులోకి వస్తే దేశంలోని అన్ని రాష్ట్రాల విద్యార్థులు న్యాయ విద్యను అభ్యసించేందుకు వీలుంటుందన్నారు. ఈక్రమంలో సీఎం వైఎస్ జగన్ పునాదిరాయి వేయడానికి వస్తుండడంతో రహదారులతో సహా మౌలిక సదుపాయాలను కల్పించాలన్నారు. హెలిపాడ్ ఏర్పాటుకు సంబంధించి అనుకూల స్థలాన్ని చూడాలన్నారు. ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశంలో లా వర్సిటీకి 100 ఎకరాలు కేటాయించామని, అంతకు ముందే 50 ఎకరాలు కేటాయించిన విషయం తెలిసిందేనన్నారు. జ్యుడీషియల్ సిటీ, నేషనల్ లా యూనివర్సిటీ నిర్మాణాలకు సంబంధించి పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో జాతీయ రహదారి నుంచి ఐఐఐటీడీఎం వరకు రూ.3.5 కోట్లతో నిర్మించిన ఆర్‌అండ్‌బీ రోడ్డును పూర్తి చేయడంపై మంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. సిల్వర్ జూబ్లీ, క్లస్టర్ యూనివర్సిటీ, లా యూనివర్సిటీకి మధ్య వ్యాలీలో సుందరీకరణ పనులు చేపట్టాలని మునిసిపల్ కమిషనర్ భార్గవ్‌తేజను ఆదేశించారు. కార్యక్రమంలో విశ్రాంత ఆర్‌అండ్‌బీ ఈఈ ఏపీ శ్రీధర్‌రెడ్డి, పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ ఈఈ నిర్మల్‌కుమార్, ఏఈ స్వామిరెడ్డి పాల్గొన్నారు.

భరోసా కల్పిస్తూ.. బాధ్యత తెలుపుతూ

- విద్యా దీవెనకు ఉమ్మడి ఖాతా తప్పనిసరి
- విద్యార్థులకు నిధుల జమ తెలిసేలా చర్యలు
- ఎస్సీ విద్యార్థులతో పాటు చివరి ఏడాది చదివే విద్యార్థులకు మినహాయింపు
- జిల్లాలో 37,731 మంది విద్యార్థులకు విద్యా దీవెన
- వీరిలో ఉమ్మడి ఖాతా తెరవాల్సిన వారు 19,063 మంది
- ఖాతా తెరిచేలా అధికారుల అవగాహన



సాక్షి, నంద్యాల: విద్యా రంగంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు బంగారు బాటలు వేసేలా సరికొత్త సంక్షేమ పథకాలు అమలు చేస్తోంది. పేదరికంతో ఏ ఒక్క విద్యార్థి చదువుకు దూరం కాకూడదన్న సంకల్పంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారు. అమ్మ ఒడి, జగనన్న విద్యా కానుక, నాడు – నేడు, వసతి దీవెన, విద్యా దీవెన, జగనన్న గోరుముద్ద వంటి తదితర పథకాలను ప్రవేశపెట్టి పేద విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారు. ప్రస్తుతం విద్యా దీవెన కింద ప్రభుత్వం అర్హులైన ప్రతీ విద్యార్థి తల్లికి నేరుగా ఆర్థిక సాయం అందజేస్తోంది. ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, ఇంజినీరింగ్, ఎంబీబీఎస్ తదితర కోర్సుల విద్యార్థులకు జగనన్న విద్యా దీవెన కింద కోర్సును బట్టి రూ.15 వేల నుంచి రూ. లక్ష వరకు ఆర్థిక సాయం అందిస్తోంది. వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టిన నాటి నుంచి ప్రతి ఏడాది ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాయాన్ని నేరుగా అందిస్తోంది. ప్రభుత్వం అందజేసిన తర్వాత వారు కాలేజీ యాజమాన్యాలకు ఫీజు రూపంలో చెల్లించేవారు. అయితే తల్లి ఖాతాలో డబ్బులు ఎప్పుడు జమ అయ్యాయో విద్యార్థులకు తెలిసేది కాదు. ఈ నేపథ్యంలో ఈ పథకం ఉద్దేశం, పథకం కింద అందజేసే ఆర్థిక సాయం వివరాలు విద్యార్థులకు తెలిసేలా విద్యార్థి/తల్లితో కలిపి ఉమ్మడి ఖాతా తెరవాలని ప్రభుత్వం నిర్ణయించింది. నంద్యాల జిల్లాలో జగనన్న విద్యా దీవెన కింద ఈ ఏడాది 36,699 మంది విద్యార్థులు లబ్ధి పొందనున్నారు. ఎస్సీ విద్యార్థులతో పాటు 2023–24 విద్యా సంవత్సరంలో కోర్సు చివరి ఏడాది చదువుతున్న విద్యార్థులు ఉమ్మడి ఖాతాలు తెరవాల్సిన అవసరం లేదని ప్రభుత్వం మార్గదర్శకాలను జారీ చేసింది. వీరికి ఇప్పటి వరకు అమలవుతున్న విధంగానే ఆర్థిక సాయం నేరుగా జమవుతుంది. బీసీ, ఇతర వర్గాల విద్యార్థులు మాత్రమే ఖాతా తెరవాల్సి ఉంటుంది. ఎస్సీ, చివరి సంవత్సరం చదివే విద్యార్థులు మినహాయించి 19,063 మంది విద్యార్థులు ఖాతా తెరవాల్సి ఉంది. 36,699 మంది విద్యార్థులకు సుమారుగా రూ.65.17 కోట్లను ప్రభుత్వం అందజేయనుంది. ఉమ్మడి ఖాతాలు ఈ నెల 24వ తేదీలోపు తెరవాలని ప్రభుత్వం సూచించింది. వీరికి ఈ నెల 28వ తేదీన నాలుగో విడత విద్యా దీవెన నిధులు జమ కానున్నాయి.

ఈ నెల 24వ తేదీలోగా ఖాతా తెరవాలి

జగనన్న విద్యా దీవెనలో లబ్ధిదారులైన విద్యార్థులు ఈ నెల 24వ తేదీలోపు తల్లితో కలిసి జాయింట్ అకౌంట్ తెరవాలి. విద్యార్థికి ఇప్పటికే అకౌంట్ ఉంటే తల్లిని ఆ ఖాతాలో చేర్చి ఉమ్మడి ఖాతాగా మార్చవచ్చు. ఖాతా తెరిచిన అనంతరం ఆ వివరాలను తమ పరిధిలోని సచివాలయ సిబ్బందికి తెలియజేయాలి. వారు వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తారు. తల్లి మరణించినట్లైతే తండ్రి లేదా గార్డియన్‌తో ఖాతా తెరవొచ్చు. ఖాతాలు ఎలా తెరవాలి అన్న విషయంపై ఇప్పటికే విద్యార్థులకు అవగాహన కల్పించాం. విద్యార్థులు ఎలాంటి ఆందోళనకు గురికావల్సిన అవసరం లేదు.

– చింతామణి, సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారి, నంద్యాల

మరింత బాధ్యత పెరుగుతోంది



నేను ప్రస్తుతం ఎస్వీ యూనివర్సిటీలో ఎంఎస్సీ ఫస్ట్ ఇయర్ చదువుతున్నా. ఇప్పటి వరకు విద్యా దీవెన నిధులు ఎప్పుడు జమ అయ్యేవో నాకు తెలిసేది కాదు. ఇప్పుడు నేను మా అమ్మ విజయకుమారితో కలిసి ఉమ్మడి ఖాతా తెరిచా. నిధులు జమ అయిన వెంటనే ఇక నుంచి నాకు కూడా తెలుస్తుంది. ప్రభుత్వం మాకు ఎంతో ఆర్థిక సహాయం చేస్తోందో తెలుసుకుని మరింత బాధ్యతతో చదువుకుంటాం.

– లక్ష్మీ చరిత, వాబోలు గ్రామం, నంద్యాల

బ్యాంక్ ఖాతా వివరాలు తెలుస్తాయి



నేను అన్నమాచార్య ఇంజినీరింగ్ కాలేజీలో ఫస్ట్ ఇయర్ చదువుతున్నా. మాది వ్యవసాయ కుటుంబం. మా అమ్మకు బ్యాంకు ఖాతాలపై పెద్దగా అవగాహన లేదు. బ్యాంకులో ఎప్పుడు డబ్బులు జమ అయ్యాయో కూడా తెలియదు. ఇప్పుడు ఉమ్మడి ఖాతా తెరవడంతో ఎంత డబ్బులు పడింది, ఎప్పుడు పడిందో నాకు తెలుస్తుంది. అకౌంట్‌లో డబ్బులు జమకాగానే విత్‌డ్రా చేసి కాలేజీలో కట్టేస్తాం.

– అక్షయ్ కుమార్ రెడ్డి, ఎం. చింతకుంట్ల, గోస్పాడు మండలం



పాతాళగంగలో దీపాలు వదులుతున్న దృశ్యం




మల్లన్న దర్శనానికి క్యూలైన్‌లో వేచిఉన్న భక్తులు



నృత్యం చేస్తున్న కళాకారులు

కార్తీకం.. దీప శోభితం

శ్రీశైలంటెంపుల్: ఇల కైలాసమైన శ్రీశైల మహాక్షేత్రం కార్తీక వెలుగులతో శోభిల్లుతోంది. ఆదివారం సెలవు రోజు కావడంతో పాటు కార్తీకమాసాన్ని పురస్కరించుకుని ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు వేలాదిగా తరలి వచ్చారు. వేకువజామున పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి దీపారాధన చేశారు. అనంతరం స్వామిఅమ్మవార్ల దర్శనానికి బారులుదీరడంతో క్యూలైన్లన్నీ నిండిపోయాయి. సాయంత్రం ఆలయ ప్రాంగణంలోని ధ్వజ స్తంభంపై ఆకాశదీపాన్ని వెలిగించారు. ఈ దీపాన్ని వెలిగించినా, చూసినా సకల పాపాలు నశించి అనంత పుణ్యం లభిస్తుందని, వ్యాధులు తొలగి ఆయురారోగ్యాలు చేకూరతాయని పండితులు చెప్పారు. ఆలయ గంగాధర మండపం వద్ద, ఆలయ ఉత్తర మాడవీధిలో కార్తీకదీపారాధన చేసుకున్నారు. కార్తీక దీపాలను వెలిగించి ప్రత్యేక పూజాదికాలను నిర్వహించుకున్నారు. భక్తులు భక్తిశ్రద్ధలతో లక్ష వత్తులు, నెయ్యి వత్తులు, శివలింగాకార దీపాలు, ఓం నమఃశివాయ ఆకారంలో దీపాలను వెలిగించి పూజలు నిర్వహించుకున్నారు. కళా వేదికపై కళాకారుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి



జగనన్న వల్లే ఇల్లు వచ్చింది



జీవనోపాధి కోసం గాలిమిషన్ ఆధారంగా కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. నలుగురు కుటుంబ సభ్యులం ఉన్నాం. ఇప్పుడు అన్ని ధరలు పెరిగాయి. పూట గడవడమే కష్టం. కొన్నేళ్లుగా అద్దె ఇళ్లలోనే కాలం వెళ్లదీస్తున్నాం. ఇల్లు కట్టుకునే స్థోమత లేక సొంతిల్లు కలగానే ఉండేది. జగనన్న ముఖ్యమంత్రి అయిన తర్వాత పేదలను ఆర్థికంగా ఆదుకుంటున్నారు. ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారు. జగనన్న వల్లే మాకు పక్కా ఇల్లు మంజూరైంది. జగనన్న కాలనీలో రూ. లక్షల విలువైన స్థలం ఇచ్చారు. ఇల్లు కట్టుకునేందుకు కొంత డబ్బులు కూడా ఇచ్చారు. ఇంటి పనులు పూర్తి కావచ్చాయి. జగనన్న కాలనీలో రోడ్లు, కరెంట్, నీళ్ల సదుపాయం కల్పించారు. జగనన్న పుణ్యమా అంటూ సొంతింటికి త్వరలో చేరబోతున్నాం. మాలాంటి ఎంతో మంది పేదలు ఇంటికి యజమానులు అయ్యారు.

– కట్టుబడి రమేష్, కొలిమిగుండ్ల

పిల్లల చదువు ఖర్చుపై ఆందోళన లేదు



నేను, నా భర్త గని పనులు చేస్తూ బతుకుతున్నాం. మాకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇద్దరూ అవుకు ఆదర్శ పాఠశాలలో చదువుతున్నారు. మాలాంటి పేదోళ్లం పిల్లలను చదివించాలంటే ఇప్పుడున్న పరిస్థితుల్లో చాలా కష్టం. ఈ పరిస్థితుల్లో చదువుల భారం లేకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదుకుంటున్నారు. పైసా ఖర్చు లేకుండా చదివించుకుంటున్నాం. అమ్మఒడి పథకం వస్తుంది. జగనన్న విద్యా కానుక కింద పుస్తకాలు, బ్యాగ్‌లు, బూట్లు ఇచ్చారు. మధ్యాహ్నం భోజనంలో పౌష్టికాహారం అందిస్తున్నారు. ఆయన పాలనలో ప్రభుత్వ పాఠశాలల్లో ఎంతో మార్పు వచ్చాయి. ప్రైవేటు పాఠశాలలకంటే నదుపాయాలు బాగున్నాయి. పేదోళ్లకు జగనన్న ఎంతో చేస్తున్నారు. వచ్చే ఎన్నికల్లోనూ జనం మళ్లీ జగన్ననే గెలిపిస్తారు.

– రమణమ్మ, చెర్లోపల్లె గ్రామం, అవుకు మండలం

క్లుప్తంగా

చెక్‌డ్యామ్‌లో పడి యువకుడి మృతి

శ్రీశైలం: క్షేత్రపరిధి హెలిప్యాడ్ సమీపంలోని చెక్ డ్యామ్‌లో ప్రమాదవశాత్తు పడి ఓ యువకుడు మృతి చెందాడు. వన్‌టౌన్ ఎస్‌ఐ లక్ష్మణరావు తెలిపిన వివరాల మేరకు.. స్థానికంగా నివాసముంటున్న వెంకటనాయుడు కుమారుడు కొక్కెర నాగరాజు (17)కు మతిస్థిమితం సరిగా లేదు. ఈ నెల 17వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువకుడు తిరిగి రాలేదు. కుటుంబీకులు క్షేత్ర పరిధిలో అంతటా వెతికినా ఆచూకీ లభించలేదు. ఆదివారం ఉదయం హెలిప్యాడ్ సమీపంలోని చెక్‌డ్యామ్ మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న వెంకటనాయుడు అక్కడికి చేరుకుని తమ కుమారుడు నాగరాజుగా గుర్తించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు ప్రాజెక్ట్ కాలనీ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

ఆదోనిఅర్బన్: పట్టణంలోని ఆలూరు రోడ్డు పంజరాపోల్ మలుపు వద్ద లారీ ఢీకొనడంతో దివాకర్ నగర్‌కు చెందిన కురువ నీలకంఠ(28) అక్కడికక్కడే మృతిచెందాడు. ఈఘటన ఆదివారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. మృతుడి కుటుంబ సభ్యులు, ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కురువ నీలకంఠ బేల్దారి పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఆయనకు భార్య పద్మ, ఒక నెల కుమార్తె ఉన్నారు. పట్టణంలోని ఆర్‌ఆర్ కాలనీలో బంధువుల ఇంటికి బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడంతో నీలకంఠ అక్కడికక్కడే మృతిచెందాడు.

హంద్రీ–నీవా కాలువలో మృతదేహం లభ్యం

పత్తికొండ రూరల్: పత్తికొండ–హోసూరు రోడ్డులోని హంద్రీ–నీవా కాలువ వద్ద ఆదివారం మహిళ మృతదేహం అభ్యమైంది. గుర్తించిన సమీప పొలాల రైతులు పోలీసులకు సమాచారం అందజేశారు. మృతదేహం ఆదోని నియోజకవర్గం చిన్నపెండేకల్ గ్రామానికి చెందిన గొల్ల ఆదిలక్ష్మి(60)దిగా పోలీసులు గుర్తించారు. మూడు రోజుల నుంచి కనిపించకపోవడంతో ఆమె కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రమాదవశాత్తు కాలుజారి కాలువలో పడినట్లుగా పోలీసులు గుర్తించారు. నీటి ప్రవాహంలో కొట్టుకొచ్చిన మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

విద్యార్థి అదృశ్యం

పాములపాడు: జూటూరు గ్రామానికి చెందిన విద్యార్థి విష్ణువర్ధన్ రెండు రోజులుగా కనిపించడం లేదు. ఎస్‌ఐ అశోక్ తెలిపిన వివరాల మేరకు.. మండల కేంద్రంలోని వివేకానంద స్కూలులో 5వ తరగతి చదువుతున్నాడు. ఈ నెల 18వ తేదీ మధ్యాహ్నం 3 గంటల నుంచి కనిపించడం లేదని విద్యార్థి తండ్రి బోయ నాగార్జున పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా ఓ గుర్తు తెలియని యువకుడు పాఠశాల వద్దకు వచ్చి విష్ణువర్ధన్‌ను వెంట తీసుకెళ్లినట్లు సమాచారం. ఈ నెల 16వ తేదీ విష్ణువర్ధన్ సోదరి వివాహ నిశ్చితార్థ వేడుక జరిగింది. ఆ రోజు గుర్తు తెలియని వ్యక్తి కారులో జూటూరు గ్రామానికి వచ్చినట్లు సీసీ కెమెరాలో రికార్డు అయ్యింది. అదే పోలికలతో ఉన్న యువకుడు విష్ణువర్ధన్ స్కూలు వద్దకు వచ్చి ఇతర విద్యార్థులతో విష్ణు ఎవరని అడిగి మరీ పిలిపించుకొని అక్కడి నుంచి ఏవో మాటలు చెప్పి వెంట తీసుకెళ్లినట్లు తెలుస్తోంది.

కరువు రైతుకు ఊరట

- ఎస్‌డీఆర్‌ఎఫ్ మార్గదర్శకాలను సవరించిన ప్రభుత్వం
- టీడీపీ హయాంతో పోలిస్తే అన్ని పంటలకు పెరిగిన పరిహారం
- మొదటి సారిగా మొక్క జొన్నకు రూ.12,500 పరిహారం
- కరువు మండలాల్లో ఎన్యూమరేషన్‌కు ఆదేశాలు
- ఈ నెల 25 నాటికి ఎన్యూమరేషన్ పూర్తి.. 28లోగా ప్రభుత్వానికి నివేదిక
- ప్రాథమిక అంచనాల ప్రకారం 2.76 లక్షల హెక్టార్లలో పంట నష్టం



కర్నూలు(అగ్రికల్చర్): వర్షాభావంతో దెబ్బతిన్న రైతులకు ఉపశమనం కలిగించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కరువు ప్రాంతాలుగా గుర్తించిన మండలాల్లో పంట నష్టంపై ఎన్యూమరేషన్‌కు ఆదేశాలు ఇచ్చిన ప్రభుత్వం తాజాగా స్టేట్ డిజాస్టర్ రిలీఫ్ ఫండ్(ఎస్‌డీఆర్‌ఎఫ్) కింద వివిధ పంటలకు చెల్లించే పరిహారాన్ని సైతం సవరిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఏడాది నెలకొన్న వర్షాభావ పరిస్థితులతో కర్నూలు, నంద్యాల జిల్లాల్లో పంటలు దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం చొరవ తీసుకొని ఆయా జిల్లాల యంత్రాంగం నుంచి వచ్చిన ప్రతిపాదనల మేరకు కర్నూలు జిల్లాలో 24, నంద్యాల జిల్లాలో 6 మండలాలను.. మొత్తంగా 30 మండలాలను కరువు ప్రాంతాలుగా గుర్తించింది. కర్నూలు జిల్లాలో 26 మండలాలు ఉండగా.. తుగ్గలి, కర్నూలు రూరల్ మండలం మినహా మిగిలిన అన్ని మండలాలను కరువు ప్రాంతాలుగా గుర్తించింది. నంద్యాల జిల్లాలో బనగానపల్లె, మిడుతూరు, పగిద్యాల, గడివేముల, బేతంచెర్ల, పాణ్యం మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రభుత్వం గుర్తించింది.

రెండు హెక్టార్ల వరకు పంట నష్టం నమోదు

కరువు మండలాల్లో పంట నష్టంపై ఎన్యూమరేషన్ చేసేందుకు ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. కరువు మండలాల్లో 2 హెక్టార్ల వరకు పంట నష్టం నమోదు చేస్తారు. కనీసం 33 శాతం నష్టం జరిగిన పంటలను పరిగణనలోకి తీసుకుంటారు. గ్రామ స్థాయిలో వీఏఏ, వీఆర్‌వోలు ఒక బృందంగా ఏర్పడి ఎన్యూమరేషన్ చేస్తారు. మండల స్థాయిలో వ్యవసాయ అధికారి, తహసీల్దారు, డివిజన్ స్థాయిలో ఏడీఏలు, ఆర్‌డీవోలు ఎన్యూమరేషన్ పర్యవేక్షిస్తారు. ఎన్యూమరేషన్ డేటాను ఈ నెల 23లోగా సాఫ్ట్‌కాపీ పంపాలని జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి ఆదేశించారు. ఈ నెల 25లో ఎన్యూమరేషన్ జాబితాలను సోషల్ ఆడిట్‌కు పెట్టి అభ్యంతరాలు స్వీకరించి, వాటిని పరిష్కరించి సాఫ్ట్, హార్డ్ కాపీలను పంపాలని ఆదేశారు. జిల్లా స్థాయిలో ఎన్యూమేషన్ జాబితాలను సమన్వయం చేసి ఈ నెల 28లోగా వ్యవసాయ శాఖ జిల్లా కలెక్టర్ ద్వారా డిజాస్టర్ మేనేజ్‌మెంటుకు పంపుతారు.

రైతుల అభ్యున్నతి లక్ష్యంగా...

రైతుల అభ్యున్నతి లక్ష్యంగా స్టేట్ డిజాస్టర్ రిలీఫ్ ఫండ్ కింద జారీ చేసిన మార్గదర్శకాలను ప్రభుత్వం సవరించింది. టీడీపీ హయాంలో 2014–15 నుంచి 2018–19 వరకు ప్రతి ఏటా కరువు వచ్చినప్పటికీ మార్గదర్శకాలను సవరించలేదు. రాష్ట్ర విభజన తర్వాత మొదటిసారిగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సవరించడం విశేషం. దీంతో కరువు మండలాల్లో రైతులు ఏ పంట సాగు చేసినా పరిహారం పొందే అవకాశం ఏర్పడింది. కర్నూలు జిల్లాలోని 24 కరువు మండలాల్లో పత్తి 2,76,715, మిరప 30 వేలు, ఉల్లి 8,842 హెక్టార్లు, నంద్యాల జిల్లాలోని 6 కరువు మండలాల్లో 32,822 హెక్టార్లలో పంట నష్టం జరిగినట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. 2 హెక్టార్లలోపు 33 శాతం ఆపైన నష్టపోయిన రైతులను ఎన్యూమేషన్ ద్వారా గుర్తిస్తారు. ఉద్యాన పంటలకు సంబంధించి వర్షాధారం పంటలను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారు.

పెరిగిన పరిహారం...

గతంలో వరి, వేరుశనగ, పత్తి, చెరకు, పసుపు, మిరప, కూరగాయలు, ఉల్లి, పూలు, బొప్పాయి పంటలకు ఎస్‌డీఆర్‌ఎఫ్ కింద రూ.15,000 పరిహారం చెల్లించేవారు. తాజాగా ప్రభుత్వం ఈ పంటలకు పరిహారాన్ని హెక్టారుకు రూ.17 వేలకు పెంచింది. గతంలో మొక్కజొన్నకు ఎలాంటి పరిహారం లేదు. సవరించిన మార్గదర్శకాల ప్రకారం ఇప్పుడు హెక్టారు రూ.12,500 పరిహారం చెల్లిస్తారు. గతంలో జొన్న,సజ్జ, రాగులు, ఆముదం పంటలకు పరిహారం రూ.6800 మాత్రమే ఉండింది. నేడు ఈ పంటలతో పాటు కొర్ర, జనుము, సాములు, వరిగలు పంటలకు పరిహారాన్ని రూ.8,500 పెంచారు. టీడీపీ హయాంలో జనుము, నువ్వులు, కొర్రలు, సాములు, వరిగ, అవాలు పంటలకు రూ.5,000 మాత్రమే పరిహారం ఉండేది. పప్పుదినుసు పంటలు, పొగాకు, పొద్దుతిరుగుడు, సోయాబీన్, వాము పంటలకు రూ.10 వేల ప్రకారం పరిహారం చెల్లిస్తారు. సవరించిన మార్గదర్శకాలకు అనుగుణంగా పరిహారం చెల్లించేందుకు జిల్లా యంత్రాంగం ప్రతిపాదనలు పంపుతుంది.

> **ఈ-క్రాప్ డేటా ఆధారంగా ఎన్యూమరేషన్**
>
> కరువు మండలాల్లో పంట నష్టంపై ఎన్యూమరేషన్ పకడ్బందీగా చేపట్టడానికి చర్యలు తీసుకున్నాం. ఎస్‌డీఆర్‌ఎఫ్ కింద సవరించిన మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రభుత్వానికి నివేదికలు పంపుతాం. ఎన్యూమేషన్‌పై ఇప్పటికే ఏడీఏ, ఏవోలకు ఆదేశాలు జారీ చేశాం. అన్ని రకాల పంటలకు చెల్లించే పరిహారాన్ని ప్రభుత్వం పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇది కరువు రైతులకు ఊరట కలిగించే విషయం. ఎన్యూమరేషన్ జాబితాలను సోషల్ ఆడిట్‌కు కూడా పెడుతాం. ఈ-క్రాప్ డేటా ఆధారంగా ఎన్యూమరేషన్ జరుగుతుంది. – పీఎల్ వరలక్ష్మి, జిల్లా వ్యవసాయ అధికారి, కర్నూలు

శ్రీరంగనాథ ఆలయ అభివృద్ధికి రూ.5 లక్షల విరాళం



ఆలయ చైర్మన్‌తో దాత హనుమంతురావు

మద్దికెర: పెరవలి గ్రామంలోని శ్రీరంగనాథ స్వామి దేవాలయంలో రాజగోపురం ఎదుట షెడ్డు నిర్మాణం కోసం అదే గ్రామానికి చెందిన తలారి హనుమంతు రావు, శారదమ్మ దంపతులు రూ. 5 లక్షలు విరాళాన్ని ఆలయ చైర్మన్ దస్తగిరిగౌడ్‌కు పారా చిట్టెన్నకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవాలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ప్రాంగణం ముందు షెడ్డు నిర్మిస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే పనులు ప్రారంభించి సకాలంలో పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యుడు లక్ష్మిరెడ్డి, వీఆర్వో రంగస్వామి పాల్గొన్నారు.

మద్దిలేటయ్య క్షేత్రంలో వెలిగిన ఆకాశ దీపం



ఆకాశ దీపాన్ని ఏర్పాటు చేస్తున్న ఆలయ వేదపండితులు

బేతంచెర్ల: వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకొని ఆలయంలో ఆకాశ దీపాన్ని ఏర్పాటు చేశారు. ఆలయ ఈఓ పాండు రంగారెడ్డి, చైర్మన్ రామచంద్రుడు వేదపండితులు జ్వాలా చక్రవర్తి ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజల అనంతరం ఆదివారం సాయంత్రం ఆలయ ఎదురుగా ఉన్న ధ్వజ స్తంభంపై ఆకాశ దీపాన్ని వెలిగించారు.

కులగణనలో నమోదు చేసుకోండి

కర్నూలు(అర్బన్): రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించనున్న కులగణనలో ప్రతి ఒక్కరు నమోదు చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ దళిత సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు కొమ్ముపాలెం శ్రీనివాస్ కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అప్పట్లోనే భారత రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేడ్కర్ ఎన్ని అడ్డంకులు ఎదురైనా, రాజ్యాంగంలోని 340 ఆర్టికల్ ద్వారా బీసీ కులాల జాబితాను తయారు చేసేందుకు, వారికి రిజర్వేషన్లు కల్పించేందుకు కృషి చేశారన్నారు. సంక్షేమ అభివృద్ధి కోసం విద్య, వైద్యం, తాగునీరు, శానిటేషన్ అనే అంశాలు తెలుసుకునేందుకు కుల సర్వే చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్టికల్ 162 రాజ్యాంగం కల్పించిన హక్కు అన్నారు. ఈ సర్వేతో ఏ కులానికి ఎంత మేర బడ్జెట్ కేటాయించాలనే విషయాలు కూడా స్పష్టమవుతామన్నారు. కులగణనతో అనేక అంశాలు ముడిపడి ఉన్నందున ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని కోరారు.

మహానందిలో భక్తుల రద్దీ



దర్శనార్థం వేచి ఉన్న భక్తులు

మహానంది: కార్తీకమాసం, సెలవురోజు, పెళ్లిళ్లు అధికంగా ఉండటంతో ఆదివారం మహానంది ఆలయానికి భక్తులు పోటెత్తారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వేలాది సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణాలు కళకళలాడాయి. వేకువజామున నుంచి ప్రారంభమైన శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వర స్వామి దర్శనం రాత్రి వరకు నిర్విరామంగా కొనసాగింది. దేవస్థానం పరిధిలో ఒకే రోజు సుమారు 20కిపైగా పెళ్లిళ్లు జరగడంతో పెళ్లిసందడి నెలకొంది. భక్తుల రద్దీకి అనుగుణంగా ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది ఏర్పాట్లు చేపట్టారు. ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర దర్శనం క్యూలైన్లలో భక్తులు గంటల తరబడి వేచి ఉండి స్వామి, అమ్మవారిని దర్శించుకున్నారు.

ఎస్టీల అభివృద్ధికి సీఎం జగన్ కృషి

- ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వీర గౌరి శంకరరావు



బుచ్చమ్మతోపు గ్రామం వద్ద సమస్యలు తెలుసుకుంటున్న, వీర గౌరి శంకరరావు

మహానంది/శిరివెళ్ల/పాణ్యం: ఎస్టీల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఆంధ్రప్రదేశ్ ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావు, కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్‌నాయక్ తెలిపారు. మహానంది మండలం గాజులపల్లె సమీపంలోని బుచ్చమ్మతోపు గ్రామంలో ఆదివారం వారు పర్యటించారు. అనంతరం వారు మాట్లాడుతూ నిరుపేదలైన ఎస్టీల అభ్యున్నతికి సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నారన్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రి చేయలేని విధంగా అటవీ ప్రాంతాల్లో నివసిస్తున్నవారి భూములకు పట్టాలు అందించి, ప్రభుత్వ పథకాలు వర్తింపజేశారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్టీలకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. శిరివెళ్ల మండలం మహదేవపురంలో ఆయన పర్యటించారు. గ్రామంలోని ఎస్టీ కాలనీకి వెళ్లివారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాణ్యం మండలంలో పర్యటించి గిరిజనుల సమస్యలు తెలుసుకున్నారు. పాణ్యం గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని గిరిజన విద్యాలయాలు దేశంలోనే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. సుగాలిమెట్టలో విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గ్రామ ప్రజల విజ్ఞప్తి మేరకు హద్దులు చూపించేందుకు అధికారులకు ప్రతిపాదిస్తామన్నారు.

గర్భస్థ స్కానింగ్‌పై వైద్యులకు అవగాహన



కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న, డాక్టర్ శారద, వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): ఫెడరేషన్ ఆఫ్ గైనిక్ సొసైటీ ఇండియా కర్నూలు బ్రాంచ్ ఆధ్వర్యంలో ఆదివారం కర్నూలు మెడికల్ కాలేజీలోని న్యూ లెక్చర్ గ్యాలరీలో వైద్యులు, పీజీలకు గర్భస్థ స్కానింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమాన్ని ఏపీ మెడికల్ కౌన్సిల్ పరిశీలకులు డాక్టర్ శారద, కర్నూలు మెడికల్ కాలేజీ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సాయిసుధీర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. గర్భస్థ సమయంలో వివిధ అంశాలపై డాక్టర్ సి. స్ఫూర్తి, డాక్టర్ బి. దివ్యతేజ, డాక్టర్ బి. శిల్పారెడ్డి, డాక్టర్ బి. సురేష్, డాక్టర్ కె. అశోక్‌రెడ్డి, డాక్టర్ డి. హరినాథ్, డాక్టర్ గాయత్రి ఇంజ్ల, డాక్టర్ టీకే.తనుశ్రీ, డాక్టర్ బి.అరుణ్‌కుమార్, డాక్టర్ మంజీర వెంకటేష్, డాక్టర్ సర్వోత్తమ్, డాక్టర్ గాయత్రి వైష్ణవి వివరించారు. కార్యక్రమంలో గైనిక్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ ఎస్. వెంకటరమణ, సెక్రటరి డాక్టర్ వి.రాధాలక్ష్మి, ట్రెజరర్ డాక్టర్ మమత, డాక్టర్ వహీదా బేగం, డాక్టర్ నిరుపమ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ యోగా పోటీలకు రాష్ట్ర జట్ల ఎంపిక



జాతీయ పోటీలకు ఎంపికైన యోగా క్రీడాకారులు

కర్నూలు (టౌన్): అస్సాం రాష్ట్రం గౌహతిలో ఈనెల 23 నుంచి 26 వరకు నిర్వహించనున్న జాతీయ స్థాయి యోగా సబ్ జూనియర్, జూనియర్ బాల బాలికల పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్లను ఎంపిక చేశారు. స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో రాష్ట్ర యోగా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర యోగా సంఘం చైర్మన్ దండు లక్ష్మీకాంత రెడ్డి మాట్లాడుతూ సెప్టెంబర్ 9, 10 తేదీల్లో కర్నూలు వేదికగా నిర్వహించిన 48వ రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన వారిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు చెప్పారు.

సబ్ జూనియర్ బాలుర విభాగంలో... సీహెచ్ జైదీప్ రెడ్డి, సాత్విక్, షణ్ముఖ చౌదరి, చతుర్వేది, దేవాన్ష్ నాయుడు, సోమ సూర్య కిరణ్, సందీప్, ధీరశ్రీకృష్ణ

సబ్ జూనియర్ బాలికల విభాగంలో.. లక్ష్మీ చందన, రెహ వినూత్న రెడ్డి, మను, శ్రీకృతి, కృష్ణప్రియ, నిషా, కీర్తి, మనస్విని, హర్షవర్ధని

జూనియర్ బాలుర విభాగంలో.. శివప్రసాద్, శ్రీధర్మ, గణేష్, ధన ధీరజ్

జూనియర్ బాలికల విభాగంలో.. తస్లీమా, అర్పిత, భవానీ చౌదరి, తస్వీర్, ఫాతిమాబేగం, వెంకట త్రివేణి, ఇంద్రాణి

మహిళలను అన్ని రంగాల్లో ప్రోత్సహించాలి



సన్మానం అందుకున్న మహిళా ప్రముఖులతో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్ చంద్రబోస్

కర్నూలు కల్చరల్: మహిళలను అన్ని రంగాల్లో ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని పలువురు మహిళా ప్రముఖులు అభిప్రాయపడ్డారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్ అధ్యక్షతన ప్రముఖ మహిళలను ఘనంగా సన్మానించారు. కేడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ ఎస్వీ విజయ మనోహరి, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ శిరోమణి, బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి వెంకట లక్ష్మి, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి దీప్తి పాల్గొని ప్రసంగించారు. మహిళలకు సమాన హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి మహిళలకు అన్ని రంగాల్లో 50 శాతంపైనే అవకాశాలు కల్పిస్తున్నారన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ కార్యదర్శి పెద్దక్క, లయన్స్ క్లబ్ జిల్లా సెక్రటరీ రాయపాటి శ్రీనివాస్, నిఖిలేష్ ఎడ్యుకేషన్ అకాడమీ సంస్థ అధ్యక్షులు మద్దులేటి, సయ్యద్ జమీలా, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి మద్దయ్య, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షులు షేక్ యూనూస్, లైబ్రేరియన్లు పత్రాల గోవిందరెడ్డి, బాషా, పద్మావతమ్మ, నసీమాబీ, చంద్రమ్మ, రేణుక తదితరులు పాల్గొన్నారు.

630 మొబైల్ ఫోన్ల రికవరీ

కర్నూలు: జిల్లా పోలీసు కార్యాలయంలోని పరేడ్ మైదానంలో ఆదివారం మొబైల్ రికవరీ మేళా నిర్వహించారు. రూ.1.26 కోట్ల విలువ చేసే 630 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు ఎస్పీ కృష్ణకాంత్ అందజేశారు. ఎస్పీ మాట్లాడుతూ.. మొబైల్ పోయిన తరువాత బాధ పడడం కంటే వాటిని పోగొట్టుకోకుండా జాగ్రత్తలు పాటించడం మంచిదన్నారు. ఎవరైన మొబైల్ పోగొట్టుకున్న వారు http://kurnool police. in/mobile theft లింకును క్లిక్ చేసి మొబైల్ వివరాలను తెలియజేస్తే త్వరితగతిన అందజేసేందుకు కృషి చేస్తామని సైబర్ ల్యాబ్ టెక్నికల్ సిబ్బంది తెలిపారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు

- ఎమ్మెల్యే తొగురు ఆర్థర్



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న, ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

మిడుతూరు: క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో ఆదివారం రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అంతర్ జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ బాల, బాలికల అండర్ -14 బేస్ బాల్ రాష్ట్ర స్థాయి క్రీడా ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అట్టహాసంగా ప్రారంభించారు. క్రీడా ప్రాంగణానికి చేరుకున్న ఎమ్మెల్యేకు విద్యార్థులు క్రీడా వందనం, మార్చ్‌ఫాస్ట్ నిర్వహించి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి క్రీడాకారుడు మైదానంలో క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలన్నారు. క్రీడల్లో రాణిస్తే స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు సాధించవచ్చునన్నారు. అనంతరం క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ శివకుమార్, రాష్ట్ర పరిశీలకులు అబ్దుల్ జబార్, ఎంఈఓ శ్రీనాథ్, పాఠశాల హెచ్ఎం సాయితిమ్మయ్య, రాష్ట్ర ఉర్దూ అకాడమి డైరెక్టర్ అబ్దుల్ షకూర్, రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షుడు వంగాల సిద్దారెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు సర్కోటి గోవర్ధన్‌రెడ్డి, కమతం వీరారెడ్డి, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

మహిళలు మార్గదర్శకులుగా మారాలి



మాట్లాడుతున్న దుర్గా భవాని

నంద్యాల(న్యూటౌన్): మహిళలు మార్గదర్శకులుగా మారాలని మహిళా సమైఖ్య రాష్ట్ర కార్యదర్శి దుర్గా భవాని అన్నారు. పట్టణంలో రెండు రోజులుగా జరుగుతున్న మహిళా సమైఖ్య రాష్ట్ర మహాసభలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర మహాసభల్లో చేసిన తీర్మానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వాల అసమర్థతపై మహాసభల వేదికగా పలు తీర్మానాలు చేశామన్నారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ సమాజంలో సగ భాగం ఉన్న మహిళల అభ్యున్నతికి మహిళా సంఘాలు ఐక్యంగా పోరాడాలన్నారు. సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను నిలదీయాలన్నారు. మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలన్నారు. కార్యక్రమంలో మహిళా సమైఖ్య నాయకులు వనజ, విమల, సంధ్యా కుమారి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి రంగనాయుడు, పెంచలయ్య, బాబాఫక్రుద్దీన్, ప్రసాద్, సుబ్బరాయుడు, ప్రజానాట్య మండలి కార్యదర్శి శివయ్య తదితరులు పాల్గొన్నారు.



చాగలమర్రి జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువులతో పూర్వ విద్యార్థులు

50 ఏళ్ల తర్వాత..

చాగలమర్రి: స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 1973–74లో 10వ తరగతి విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు స్వర్ణోత్స ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ ఆత్మీయ సమ్మేళనానికి కర్నూలు, వైఎస్సార్, అనంతపురం జిల్లాలతోపాటు హైదరాబాదు, బెంగళూరు తదితర సుదూర పట్టణాల్లో స్థిరపడిన సుమారు 40 మంది పూర్వ విద్యార్థులు హాజరుకావడం విశేషం. 50 ఏళ్ల తరువాత వారందరూ కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. అనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని మురిసిపోయారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కోటయ్య, పూర్వపు ఉపాధ్యాయులు వెంకటరెడ్డి, జామునయ్య, మధుసూదన్ శర్మలను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులను వారి కుటుంబ సభ్యులతో పరిచయం చేయించి వారికి గుర్తుగా మెమెంటోలను అందజేశారు. అనంతరం మృతి చెందిన పూర్వ ఉపాధ్యాయులు, విద్యార్థులకు సంతాపం తెలిపారు. కార్యక్రమంలో పెద్దనాగయ్య, రాందాస్‌రెడ్డి, డీలర్ గౌస్‌మోహిద్దీన్, రామచంద్రుడు, సుబ్బారాయుడు, బాసుబ్బయ్య, విజయభాస్కర్‌రెడ్డి, సత్యనారాయణ, జయరామ కృష్ణారెడ్డి, శ్రీనివాసరెడ్డి, సత్యనారాయణరెడ్డి, శివలీలా, కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.